www.nagaranijam.com

PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 13 | సంచిక :332 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 19 గురువారం, ఫిబ్రవరి 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 332 | Rangareddy | Editor : Yela.Purushotham | 19 Thursday, February 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## అర్హులైన జర్నలిస్టులందరికీ జిఓఎంఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ

- సమాచార, పౌర సంబంధాల శాఖ

**స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక**



**హైదరాబాద్ ఫిబ్రవరి 18 (నగర నిజం న్యూస్ ):**రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి ఓ ఎం ఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీ ల్యాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్ సైట్‌ను రూపొందించామన్నారు. ipr.telangana.gov.in వెబ్ సైట్ లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తులను ఆన్లైన్ లో తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైన టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగం లో ఈ నెంబర్ 9154170881కు కార్యాలయం పని వేళలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలో సంప్రదించవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపా

## నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఒక్కసారిగా బాంబు కలకలం

- ఏకంగా 12 ఆర్డీఎక్స్‌లతో కోర్టును

**పేల్చేయబోతున్నామని మెయిల్**




**హైదరాబాద్ ఫిబ్రవరి 18 (నగర నిజం న్యూస్ ):**నాంపల్లి క్రిమినల్ కోర్టులో బుధవారం ఒక్కసారిగా బాంబు కలకలం రేగింది. కోర్టు భవనంలో బాంబులు పెట్టామని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఏకంగా 12 ఆర్డీఎక్స్‌లతో కోర్టును పేల్చేయబోతున్నామని మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో కోర్టులోని న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ బెదిరింపు నేపథ్యంలో పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. కోర్టు భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి తనిఖీలు చేపట్టారు. కోర్టు భవనం మూలమూలలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఇది కేవలం ఆకతాయిల పనేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసేందుకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చైనా రోబోను మనదిగా చూపించి అవమానించారు.. చైనా మీడియా ఎగతాళి చేస్తోంది: రాహుల్ గాంధీ

**హైదరాబాద్ ఫిబ్రవరి 18 (నగర నిజం న్యూస్ ):**దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం చైనా రోబోడాగ్‌ను తాము అభివృద్ధి చేసినట్లుగా పేర్కొంటూ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సదస్సులో నుంచి గల్గోటియాస్ విశ్వవిద్యాల యానికి ఉద్వాసన పలికింది. ఈ వివాదంపై లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సును అధ్వానంగా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ప్రతిభను ప్రపంచానికి చూపకుండా పీఆర్ స్టంట్ చేస్తున్నారని ఆరోపించారు. భారతీయుల డేటాను అమ్మకానికి పెట్టి చైనా ఉత్పత్తులతో షో చేస్తున్నారని విమర్శించారు. చైనా అభివృద్ధి చేసిన రోబోలను మనవిగా చూపించి అవమానాలకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ సమ్మిట్‌ను ఒక జోక్‌గా మార్చారని మండిపడ్డారు. భారతదేశం ప్రతిభను కనబర్చాల్సిన చోట ఈ తీరు దారుణమని అన్నారు.

## వైభవంగా ప్రారంభమయిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



**యాదాద్రి భువనగిరి 18 (నగరనిజం న్యూస్ );**యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూలవర్యుల అనుమతితో నిజాభిషేకం, విశ్వక్సేనారాధన, జలపూజ, పుట్టమట్టిలో నవధాన్యాలు నాటడంతోపాటు స్వస్తివాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. తొలి పూజల్లో కలెక్టర్ హనుమంత రావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు.


### బ్రహ్మోత్సవాలు ఇలా..

ఫిబ్రవరి 18 న స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధన, సాయంత్రం మత్స్యగ్రహణం, అంకురార్పణఫిబ్రవరి 19న ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం భేరి పూజ. ఫిబ్రవరి 20 న ఉదయం మత్సావతార అలంకారం, సాయంత్రం శేష వాహన సేవ వేదపారాయణములు. రాత్రి 7 గంటలకు శేష వాహన సేవఫిబ్రవరి21 న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంస వాహన సేవఫిబ్రవరి22 న శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్న వాహన సేవ.ఫిబ్రవరి23 న ఉదయం గోవర్ధన గిరి ధారి, సాయంత్రం సింహ వాహన సేవఫిబ్రవరి 24 న జగన్మోహినీ అలంకార సేవ, అశ్వ వాహనం పై రాత్రి ఎదుర్కోలు వేడుకఫిబ్రవరి 25 న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవంఫిబ్రవరి 26న రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం ఫిబ్రవరి27 న స్వామి వారి చక్రతీర్థ స్నానం. ఫిబ్రవరి 28 న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి.

## అక్రిడేషన్లు పొందడంలో జర్నలిస్టుల ఇబ్బందులను తొలగించండి

- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి

**డబ్ల్యూజేఐ ప్రతినిధుల వినతి**



**ఖమ్మం:( నగర నిజం బ్యూరో) ఫిబ్రవరి 18:** ఖమ్మం: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం (ఐ అండ్ పీఆర్) జారీ చేసిన 'ది తెలంగాణ మీడియా అక్రిడేషన్ రూల్స్ 2025' లో కొన్ని నిబంధనలు జిల్లాల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు 'అక్రిడేషన్ కార్డులు' పొందడంలో ఇబ్బందిగా మారాయని, వాటికి వెంటనే సవరణలు చేయాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (ఔజీ×)ఖమ్మం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో అనుదీప్ దూరిశెట్టిని కలిసిన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. ఎస్ రావు, ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కోకన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాస రావు, ఎం.ఏ అన్సార్ పాషా, అమరనేని రామకృష్ణ, ఖమ్మం నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబరావు, బొడ్డుపల్లి రవీందర్ అక్రిడేషన్లు పొందడంలో చిన్న పత్రికలు, డెస్క్,ఇండిపెండెంట్, వెబ్ సైట్, కేబుల్ టీవీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సారి 2,000 నుండి 15, 000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు అసలు జిల్లా కేంద్రంలో అక్రిడేషన్ కార్డులే లేవని తెలిపారు. 15,000 నుండి 25, 000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు ఒక్క జర్నలిస్టుకు మాత్రమే కార్డు(మండలం) ఇస్తున్నారని, ఫోటోగ్రాఫర్ కు కూడా కార్డు లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, 25,000 నుండి 75, 000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు సహితం ఒక జర్నలిస్ట్, ఒక ఫోటో గ్రాఫర్ కు మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇస్తున్నారని, ఈ మూడు కేటగిరీల్లో డెస్క్ జర్నలిస్టులకు, జిల్లాలో ప్రచురణ కేంద్రం వుంటే ఒక్కొక్క కార్డు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇవి ఆయా పత్రికల్లో పని చేస్తున్న ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టులకు ఏ మాత్రం సరి పోనందున ప్రతి కేటగిరీలో కార్డులు పెంచాలని, జిల్లా కేంద్రాల్లో పని చేసే క్రైమ్, స్పోర్ట్స్, కల్చరల్, ఎడ్యుకేషన్ జర్నలిస్టులకు కూడా రాష్ట్ర స్థాయిలో ఇచ్చినట్లు 'అక్రిడేషన్ కార్డులు' ఇవ్వాలని కోరారు. డెస్కులో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, 'మహిళా జర్నలిస్టులు 33 శాతం లేని చోట ఆ కార్డులను మిగిలిన డెస్క్ జర్నలిస్టులకు ఇవ్వాలని, నిబంధనల్లో 'మాండేట్' అన్న పదాన్ని తొలగించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కార్డులు పొందాలంటే, ఇండిపెండెంట్ (ఫ్రీలాన్సర్) జర్నలిస్టులు 5 పాత కార్డులతో పాటు 6 నెలల్లో ప్రచురితమైన 20 బై లైన్ వార్తా క్లిప్పులు పపెట్టాలని విధించిన నిబంధనను సవరించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులు ఎక్కువగా చిన్న పత్రికలు, డిజిటల్ మీడియాలో వార్తలు రాస్తున్నందున, ఇండిపెండెంట్ జర్నలిస్టులు తమ వార్తలకు ఏ వేదికను ఉపయోగించుకున్నా , వార్త ఎక్కడ ప్రచురితమైనా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని సూచించారు. న్యూస్ వెబ్ సైట్లకు గడిచిన 6 నెలల్లో ... నెలకు 5 లక్షల యూనిక్ విజిటర్స్ వుండాలన్న నిబంధన కూడా సరైంది కాదని పేర్కొన్నారు. డిజిటల్ మీడియాలో ఒక యూనిక్ విజిటర్ ఒక పేపర్ సబ్ స్క్రైబర్ తో సమానమని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 2.5 లక్షల సర్క్యులేషన్ వున్న పత్రికలనే పెద్ద పత్రికలుగా గుర్తించినప్పుడు, ఒక వెబ్ సైట్ కు నెలకు 5 లక్షల యూనిక్ విజిటర్స్ వుండాలని నిబంధన పెట్టడం సమంజసం కాదని ఎర్కొన్నారు. ఇది పెద్ద పత్రికల సర్క్యులేషన్ కన్నా (డబుల్) చాలా ఎక్కువగా వున్నందన ఈ సంఖ్యను బాగా తగ్గించాలని కోరారు. అలాగే కేబుల్ టీవీ జర్నలిస్టులకు ప్రసార కేంద్రంలో (జిల్లాలో) 3 అక్రిడేషన్ కార్డులు మాత్రమే ఇస్తున్నారని, వాటిని గతంలో లాగా 4 కార్డులకు పెంచాలని కోరారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను అర్థం చేసుకొని తన పరిధిలో వున్న వాటిని పరిష్కరించాలని, లేని వాటిని సంబంధిత శాఖాధికారులకు పంపాలని కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి డబ్ల్యూజేఐ ప్రతినిధులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## కులగణన అధికారిక గణాంకాలతో బీసీల్లో పెల్లుబికిన రాజకీయ చైతన్యం

- 61 % చైర్మన్, కౌన్సిలర్లుగా బీసీలు గెలవడం మారుతున్న రాజకీయ వాతావరణానికి నిదర్శనం.
- నిరంతర బీసీ ఉద్యమాలతో అంటుకున్న సామాజిక తెలంగాణ నినాదం.
- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక

**అధ్యక్షులు దాసు సురేశ్**



**హైదరాబాద్ ఫిబ్రవరి 18 (నగరనిజం న్యూస్ );** మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీసీలు 61 శాతం ఫలితాలను సాధించి విజయ దుందుభి మోగించటం తెలంగాణ రాజకీయాల్లో చారిత్రక ఘట్టంగా బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అభివర్ణించారు .తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ద్వారా వెలువడిన అధికారిక గణాంకాలు బీసీలను రాజకీయంగా పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయని దాసు సురేశ్ పేర్కొన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం, నిరంతర బీసీ ఉద్యమాల మూలాన రాష్ట్రంలో సామాజిక తెలంగాణ నినాదం అంటుకుందన్నారు.. ఈ ఫలితాలను బట్టి చూస్తే తెలంగాణ రాజకీయాల్లో కుల సమీకరణ పతాక స్థాయికి చేరినట్టు విషదమవుతుందన్నారు . ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లతో వెలువడిన నోటిఫికేషన్ హైకోర్ట్ స్టే తో నిలిపివేయబడటం బీసీలపై జరుగుతున్న అన్యాయం పట్ల ఆలోచనను రేకెత్తించిందన్నారు.. ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో పీసీసీ చీఫ్ గా బీసీనే కాంగ్రెస్ నియమించాలన్న తమ ప్రయత్నాలు ఫలించడం ద్వారా నేడు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రూపంలో పెద్దఎత్తున కాంగ్రెస్ నుండి బీ- ఫారంలను బీసీ లు పొందే అవకాశం కలిగిందన్నారు..తద్వారా బీసీలు మెరుగైన ఫలితాలు సాధించే వీలు కలిగిందన్నారు..తాము ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నియమించిన కమిటీలతో, నిర్వహించిన కార్యక్రమాలతో పట్టణాలు, గ్రామాల వరకు బీసీ రాజ్యాధికార భావజాలం విస్తరించి సత్ఫలితాలను ఇస్తుందన్నారు.. బీసీలలో వస్తున్న క్షేత్ర స్థాయి చైతన్యాన్ని గమనించి కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల మూలంగానే అద్భుత విజయాన్ని సాధించగలిగిందన్నారు. మారుతున్న ప్రజల చైతన్యాన్ని బట్టి ఇకనైనా అట్టడుగు,బిసి వర్గాల పట్ల రాజకీయ పార్టీలు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. అవకాశాలు వస్తే రాజకీయాల్లో సైతం అద్భుతంగా రాణించగలమని బీసీలు పంచాయతీ, పట్టణ ఎన్నికలలో నిరూపించారన్నారు.. ఈ చైతన్యానికి చట్టసభల్లో కొనసాగించటమే ఇక మిగిలిందని వెల్లడించారు. రాబోయే గ్రేటర్ ఎంపీటీసీ,జడ్పిటిసి లలో సైతం ఇవే ఫలితాలు పునరావృత్తం అవుతాయని తేల్చి చెప్పారు.

## జగిత్యాల ఎమ్మెల్యేని కలిసిన రాయికల్ నూతన పాలకవర్గం



**రాయికల్ ఫిబ్రవరి 18 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ నూతన కార్యవర్గ సభ్యులు మరియు చైర్మన్ కట్కం రవీందర్ లు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి, పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కట్కం రవీందర్ , వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి , పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పహాడిషరీఫ్ నూతన సీఐగా లక్ష్మి నారాయణ రెడ్డి



**మహేశ్వరం ఫిబ్రవరి 18, (నగరనిజం)** : పహాడిషరీఫ్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా నియమితులైన లక్ష్మి నారాయణ రెడ్డి అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పూర్వ సీఐ నుండి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, శాఖ పనితీరుపై సమీక్ష చేశారు.ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థను అమలు చేస్తూ, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, యువతలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటేనే శాంతి భద్రతలు బలపడతాయన్నారు.

## బండి రమేష్ ఆవిష్కరించిన బ్రోచర్
## 9,000 మందితో బృంద నృత్యం లక్ష్యం

### సాయి అలేఖ్య 30వ వార్షికోత్సవం రైతుకు వందనం రికార్డ్ దిశగా




**కూకట్పల్లి,18 ఫిబ్రవరి (నగర నిజం ప్రతినిధి) :** సాయి అలేఖ్య సంస్థ తన 30వ వార్షికోత్సవంను అద్భుతంగా జరుపుకునేందుకు సిద్ధమైంది. “రైతుకు వందనం జై కిసాన్” పేరుతో ఫిబ్రవరి 28న సాయంత్రం 6 గంటలకు ఎల్.బి. స్టేడియంలో ఈ వేడుక జరగనుంది. ఈ సందర్భంగా 9,000 మందితో బృంద నృత్యం ప్రదర్శన ద్వారా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్లో స్థానం సంపాదించేందుకు ప్రయత్నం జరుగుతోంది.ఈ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ హాజరుకానున్నారు. ఈ వేడుకకు సంబంధించిన బ్రోచర్ను బండి రమేష్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో బండి రమేష్, సాయి అలేఖ్య వ్యవస్థాపకులు అరుణ అశోక్, సభ్యులు సాయి తులసి పాల్గొన్నారు.“రైతు ఉన్నతే దేశ బలమూ రైతు సంతోషమే మన ప్రగతి దారి!” అని నిర్వాహకులు పేర్కొంటూ ప్రజలందరినీ ఈ 30వ వార్షికోత్సవం ‘రైతుకు వందనం’ కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.

# బలవంతంగా భూములు లాక్కుంటే ఉద్యమాన్ని
# అసెంబ్లీ వరకు తీసుకెళ్తాం





- పట్లోళ్ల కార్తీక్ రెడ్డి
- భూమికి భూమి....ప్లాటుకు ప్లాటు ఇస్తేనే భూ సేకరణకు అంగీకరిస్తామన్న కార్తీక్ రెడ్డి
- శంషాబాద్ (మం)లోని నర్కూడ గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామసభ
- గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో వెంకటరెడ్డి, ఎమ్మార్వో రవీందర్ దత్ తో పాటు హెచ్ఎండీఏ అధికారులు
- నిర్వాసిత బాధితులతో కలిసి అధికారులను నిలదీసిన గులాబీ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి
- బలవంతంగా భూములు లాక్కుంటే ఉద్యమాన్ని అసెంబ్లీ వరకు తీసుకెళ్తామని కార్తీక్ రెడ్డి హెచ్చరిక

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (నగరనిజం ప్రతినిధి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధి కోసం రైతుల భూములు లాక్కుంటారా అని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమికి భూమి, ప్లాటు కు ప్లాటు పరిహారంగా ఇస్తేనే రేడియల్ రింగురోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణకు అంగీకరిస్తామని ఆయన తేల్చి చెప్పారు.బలవంతంగా రైతుల నుండి భూములు లాక్కోవాలని చూస్తే ఉద్యమాన్ని అసెంబ్లీ వరకు తీసుకెళ్తామని కార్తీక్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. హైదరాబాద్ శివారు శంషాబాద్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు నుండి శంషాబాద్ మండలం మీదుగా కొడంగల్ వరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఇప్పటికే భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం.... రైతుల నుండి అభిప్రాయాల తో పాటు అభ్యంతరాలను స్వీకరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం నాడు రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం లోని నర్కూడ గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ సారథ్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్వాసిత రైతులు.... తమ గోడు చెప్పుకొని కన్నీటి పర్యంతమయ్యారు. రైతులు, నిరుపేదలు పైసా పైసా కూడబెట్టి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ప్లాట్లు కొనుగోలు చేశారని, తీరా ఇప్పుడు ప్రభుత్వం రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూములను సేకరిస్తే నిరుపేదలు కొనుగోలు చేసిన ప్లాట్లు, భూములు కోల్పోయే పరిస్థితి నెలకొందని స్థానిక సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, మల్కారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ బూరుకుంట సతీష్, సీపీఎం నేత నీరటి మల్లేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ తదితర బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు న్యాయం చేసి ఆ తర్వాతనే భూములను సేకరించాలని అధికారులకు విన్నవించారు.


### ఉద్యమాన్ని అసెంబ్లీ వరకు తీసుకెళ్తాం: పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయోజనాల కోసం రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం శంషాబాద్ ప్రాంత రైతులు నష్టపోవాలా అని ఆయన అధికారులను నిలదీశారు. ప్రస్తుతం నర్కూడ గ్రామం మీదుగా ఉన్న రోడ్డును 120 అడుగుల వెడల్పుతో విస్తరిస్తున్నారని అలాంటప్పుడు రేడియల్ రింగ్ రోడ్డును నిర్మించాల్సిన అవసరం ఏమిటని కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. నర్కూడ మీదుగా విస్తరిస్తున్న రోడ్డును కావాలంటే మరింతగా విస్తరించాలి తప్ప రేడియల్ రింగ్ రోడ్ అవసరం లేదని ఆయన తేల్చి చెప్పారు.రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం జల వనరులను ధ్వంసం చేయాలని ఏ చట్టంలో ఉందని కార్తీక్ రెడ్డి అధికారులను నిలదీశారు. జల వనరుల విధ్వంసాన్ని ఆపడానికి ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చిందని, అలాంటప్పుడు ప్రభుత్వమే జలవనరులను ధ్వంసం చేస్తూ రేడియల్ రింగ్ రోడ్డును నిర్మిస్తుంటే హైడ్రా ఏం చేస్తోందని కార్తీక్ రెడ్డి మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ చేపట్టాలని 2013 భూ సేకరణ చట్టం చెబుతోందని, మరి ప్రస్తుతం ప్రభుత్వం తలపెట్టిన రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో ప్రజా ప్రయోజనం ఎక్కడ దాగి ఉందో చెప్పాలని కార్తీక్ రెడ్డి అధికారులను నిలదీశారు.ప్రభుత్వం ఒకవేళ తప్పని సరిగా రేడియల్ రింగ్ రోడ్డు ను నిర్మించాలనుకుంటే నిర్వాసితులకు భూమికి భూమి, ప్లాటు కు ప్లాటు పరిహారంగా ఇవ్వాలని, లేకపోతే భూ సేకరణకు అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన కుండ బద్దలు కొట్టారు. ప్రభుత్వం కాదు కూడదని మొండికేసి రైతుల నుండి భూములను లాక్కోవాలని చూస్తే ఉద్యమాన్ని అసెంబ్లీ వరకు తీసుకెళ్తామని పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించడానికి వచ్చిన అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి బాధితులకు న్యాయం చేయాలని, బాధితుల గోడును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కార్తీక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఎమ్మార్వో రవీందర్ దత్,నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ నీరటి మహేష్, మాజీ జెడ్పిటిసి బూరుకుంట సతీష్, శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, నర్కూడ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు కొనమొల్ల శ్రీనివాస్, మంచర్ల మోహన్ రావు,బూరుకుంట మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ తదితర హెచ్ఎండిఏ అధికారులు, భూ నిర్వాసితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







## ఇందిరా పార్క్ వద్ద కెజికెఎస్ గౌడ సంఘం నిరాహార
## దీక్షకు ప్రముఖుల నేతల సంఘీభావం





**ఎల్బీనగర్, ఫిబ్రవరి 18 (నగర నిజం)** హైదరాబాద్లోని ఇందిరా పార్క్ సమీపంలో “కెజికెఎస్ గౌడ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎంవి రమణ“ కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్ష కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ “మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్,“ “మాజీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్,“ “అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు జేఏసి కో-చైర్మన్ కూరెళ్ళా వేములయ్య గౌడ్,“ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బంధారం అనిల్ గౌడ్ పాల్గొన్నారు. గౌడ సమాజ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ నిరాహార దీక్షకు వివిధ గౌడ సంఘాల అధ్యక్షులు, నాయకులు, గౌడ సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా సమాజ అభ్యున్నతికి ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.





## గ్రామ అభివృద్ధి కోసం అందరం కృషి చేసుకుందాం..

- నక్కలపల్లి సర్పంచ్ యాదయ్య..




**మొయినాబాద్,18 ఫిబ్రవరి (నగర నిజం):** గ్రామ అభివృద్ధిలో అందరూ కృషి చేసుకుందామని నక్కలపల్లి సర్పంచ్ మంగళవారం యాదయ్య ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్ లు పేర్కొన్నారు మండల పరిధిలోని అక్కలపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి గ్రామసభను నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గంతో పాటు గ్రామస్తులు ఈ సభలో పాల్గొన్నారు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఉన్నప్పటికీని వాటిని దశలవారీగా పరిష్కరించుకుందామని తెలిపారు ముఖ్యంగా ఈ ఎండాకాలంలో ప్రజలకు నీటి ఎద్దరి రాకుండా అందరూ కృషి చేసుకుందామని అన్నారు పైపులైన్ లీకేజీలు మరమ్మతులు నిర్వహించుకొని ఆన్ ఆప్ లేని వద్ద నల్లాలను బిగించుకుందామని తెలిపారు వృధా నీటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు రోడ్లపై చెత్త వేయకుండా చెత్తబుట్టాలలో వేసి చిత్త బండిలో వేయాలని పేర్కొన్నారు గ్రామ అభివృద్ధి గేయంగా పంచాయతీ పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు గ్రామస్తులు యువకులు అందరూ సహకరించి. ఆదర్శ గ్రామంగా నక్కలపల్లి గ్రామాన్ని మండలం లో కాకుండానే జిల్లాలో నక్కలపల్లి ఆదర్శ గ్రామ అభివృద్ధికి కృషి చేసుకుందామని పేర్కొన్నారు అందరూ సహకరించి కృషి చేసినప్పుడే అభివృద్ధిలో ముందుకెళ్తుందని తెలిపారు మండలం నికి చివరగా ఉన్న నక్కలపల్లి గ్రామం దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉందని బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలపడంతో బస్సుల కోసం ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ప్రభుత్వము ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలపడంతో గుంతలు పడ్డ చోట మట్టిని వేసి మరమ్మతులు చేయించుకుందామని వారు అన్నారు ప్రభుత్వము నిధులు మంజూరు చేసినప్పటికీని కాంట్రాక్టర్లు అధికారులు సకాలంలో సహకరించడం లేదని తెలియజేశారు త్వరలోనే రోడ్డు పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు నక్కలపల్లి వరకు రోడ్డు నిధులు మంజూరయ్యాయని ప్రస్తుతం కోల్కతా వరకు రోడ్డు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా గ్రామాల రోడ్లు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎంతో కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్వాతి అశ్విని స్రవంతి తేజశ్రీ రవీందర్ జీవన్ కుమార్ పంచాయత్ కార్యదర్శి యాదగిరి గ్రామపంచాయతీ గణేష్ ఏఈఓ కుమార్ కరెంట్ లైన్మెన్ మల్లేష్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మంగా అంగన్వాడీ టీచర్ కాంతమ్మ ఆశా వర్కర్ యాదమ్మ బీబీకే శిరీష వీఆర్ఏ వెంకట యా గ్రామస్తులు నాయకులు యువకులు, మహిళలు మహిళ సంఘాలు పాల్గొన్నారు.

# ఆర్ ఆర్ ఆర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం





- ఆర్డీవో వెంకటరెడ్డి
- రైతుల అంగీకారంతోనే భూములను

**సేకరిస్తామని స్పష్టం చేసిన ఆర్డీవో వెంకటరెడ్డి**

- భూ సేకరణలో మానవత దృక్పథంతో

**వ్యవహరిస్తామని భరోసా ఇచ్చిన ఆర్డీవో**

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (నగరనిజం ప్రతినిధి):** రైతుల అంగీకారంతోనే భూసేకరణ చేపడతామని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆర్డీవో వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నిర్వాసిత రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు ఆయన వివరించారు. రేడియల్ రింగురోడ్ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆర్డిఓ వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. రేడియం రింగ్ రోడ్డుకు భూ సేకరణ నేపథ్యంలో బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని నర్కూడ వద్ద నిర్వహించిన గ్రామసభలో రాజేంద్రనగర్ ఆర్డిఓ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులను, భూ నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడిన ఆర్డీవో వెంకట్ రెడ్డి.... బాధిత రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల అంగీకారంతోనే భూములు సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశానుసారంగానే భూ సేకరణ కోసం ప్రజల నుండి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించడానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో వెంకటరెడ్డి స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్ నుండి నేషనల్ హైవే 167 వరకు సుమారు 81 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో శంషాబాద్ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని ఆయన భరోసా ఇచ్చారు.నిర్వాసితులతో పాటు ప్రజల నుండి వస్తున్న విజ్ఞప్తులను కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో వెంకటరెడ్డి స్పష్టం చేశారు. రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టి భూసేకరణ విషయంలో రైతుల అనుమానాలను నివృత్తి చేస్తామని హామీ ఇచ్చారు. రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం విషయంలో నిర్వాసితులతో పాటు ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చునని సూచించారు. భూసేకరణ విషయంలో తప్పకుండా మానవతా దృక్పథంతో ఆలోచిస్తామని ఆర్డీవో వెంకటరెడ్డి బాధిత రైతులకు భరోసా ఇచ్చారు.

## మన రోడ్లు మనం అభివృద్ధి చేసుకుందాం..

- వెంకటాపూర్ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి..
- వెంకటాపూర్ చేవెళ్ల రోడ్డుపై గుంతల పూడ్చివేత..



**మొయినాబాద్,18 ఫిబ్రవరి (నగర నిజం):** ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని దానికంటే మన ఊరు మన అవసరాలు అని నినాదంతో అభివృద్ధి చేసుకున్నప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతామని వెంకటాపూర్ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి పేర్కొన్నారు మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాపూర్ నుంచి చేవెళ్ల వరకు వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలలలో మట్టి పోష కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ రహదారి శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుంచి మొదలుకొని వెంకటాపూర్ చేవెళ్ల వరకు వెళ్లడం జరుగుతుంది వెంకటాపూర్ కేతిరెడ్డిపల్లి నక్కలపల్లి పలుగుట్ట కందవాడ చేవెళ్ల వరకు ఈ రహదారిలో ఏర్పడిన గుంతలపై మట్టి పోసి కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు విజయ్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఆదర్శమని వెంకటాపూర్ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు పేదలకు ప్రజలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు స్వచ్ఛందంగా యువత వివిధ సంఘాల నాయకులు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు రాధార్లు సక్రమంగా ఉన్నప్పుడే ప్రమాదాలు జరగని సూచించారు రోడ్డుపై ఏర్పడిన గుంతలు మట్టిబోసి నింపడంతో ప్రమాదాలు నివారించేందుకు ఎంతో ఆదర్శంగా ఉంటాయని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్ గ్రామస్తులు వెలుగుల యాదగిరి మహేందర్రెడ్డి లక్ష్మీనారాయణ లక్ష్మణ్ కుమార్ గ్రామ యువకులు ప్రజలుతదితరులు పాల్గొన్నారు

# రెవెన్యూ శాఖ టైపిస్ట్-కమ్-కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు కొనసాగించాలి

- కలెక్టర్‌ను కలిసిన ట్రెసా ప్రతినిధులు
- సేవలు నిలిపివేత ఆదేశాలపై ఆందోళన

**వ్యక్తం చేసిన ఉద్యోగులు ప్రభుత్వానికి**

**ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ హామీ.**



**మెదక్ బ్యూరో : నగర నిజం:: సంగారెడ్డి, ఫిబ్రవరి 18:** సంగారెడ్డి జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్-కమ్-కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను కొనసాగించాలని ట్రెసా ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది.గత వారం సీసీఎల్ఏ కార్యాలయం నుండి జారీ చేసిన మెమో ప్రకారం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్-కమ్-కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వడంతో జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఆపరేటర్లు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ట్రెసా కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను నాయకత్వానికి వివరించారు.ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ట్రెసా జిల్లా నాయకత్వం, అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి కిరణ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. టైపిస్ట్-కమ్-కంప్యూటర్ ఆపరేటర్లు ఎన్నో సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో కీలక సేవలు అందిస్తూ పరిపాలనలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని వారు వివరించారు.ఇందులో చాలా మంది ఉద్యోగులు వయోపరిమితి దాటిపోయినందున ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయారని, వారి కుటుంబాలు పూర్తిగా ఈ ఉద్యోగాలపైనే ఆధారపడి ఉన్నాయని ట్రెసా ప్రతినిధులు కలెక్టర్‌కు తెలియజేశారు. అందువల్ల వారి సేవలను కొనసాగించేందుకు ప్రభుత్వానికి తక్షణ చర్యలు తీసుకుని ప్రతిపాదనలు పంపాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని పరిశీలించి సీసీఎల్ఏ కార్యాలయానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మౌలాలి, జెశ్వంత్, ప్రభు, యాదగిరి, పవన్ తదితర కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## జేఎన్టీయూహెచ్ సౌత్ జోన్ చెస్ పురుషుల జట్టు ఎంపిక



**కూకట్పల్లి ఫిబ్రవరి 18,(నగర నిజం ప్రతినిధి) :**జేఎన్టీయూ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలోని సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పురుషుల జట్టును ఎంపిక చేయడం జరిగింది.ఈ ఎంపిక ప్రక్రియ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో సెలక్షన్ ప్రక్రియ నిర్వహించడం జరిగింది.ఈ సెలక్షన్ ప్రక్రియలో చీఫ్ సెలెక్టర్ గా చెస్ ఆర్బిటర్ సుబ్బరాజు వ్యవహరించడం జరిగింది.ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు భారతి దాసన్ యూనివర్సిటీ చెన్నైలో మార్చి 2 వ తారీకు నుండి 6 వ తారీకు వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ లో జట్టు పాల్గొననున్నట్లు ప్రొఫెసర్ దిలీప్ తెలిపారు.ఈ సెలక్షన్ ప్రక్రియలో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

# హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ నందు పిఏడి సమస్య వచ్చిన వారికి ఎండోవ్యాస్కర్ టెక్నిక్ ద్వారా వైద్యం

**ఖమ్మం నగర నిజం బ్యూరో ఫిబ్రవరి 18:** ఖమ్మం యశోద హాస్పిటల్ లో జరిగిన సమావేశంలో ఎంబిబిఎస్ , ఎంఎస్ ( జనరల్ సర్జరీ ) , డి ఎన్ బి (వసక్యూలర్ సర్జరీ ) , కన్సల్టెంట్ వసక్యూలర్ & ఎండువాసక్యూలర్ సర్జన్ ఫుట్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీ కాంత్ రాజు మాట్లాడుతూ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ నందు పిఏడి సమస్య వచ్చిన వారికి అడ్వాన్స్ టెక్నాలజీ ప్రొసీజర్ తో అత్యాధునిక సదుపాయాలతో అతి తక్కువ ఖర్చుతో ఓల్డ్ క్లాస్ స్థాయిలో ఎండోవ్యాస్కర్ టెక్నిక్ ద్వారా వైద్యం అందిస్తున్నాం అన్నారు . ఈ ప్రొసీజర్ ను నిడిల్ పంచర్ ద్వారా జస్ట్ వైర్లు పాస్ చేస్తారు ఎక్కడ కూడా ఒక్క కోత కూడా కనబడదు ఎటువంటి మత్తుమందు ఇవ్వకుండా పేషంట్ స్పృహలో ఉన్నప్పుడే చేస్తారన్నారు . ఆ తర్వాతకి యధా విధంగా అన్ని పనులు చేసుకోవచ్చు అని తెలిపారు . కాళ్లకు సంబంధించిన ఫిజికల్ యాక్టివిటీ వ్యాయామం చేయడం , దుమ్మపానం , మద్యపానాలకు దూరంగా ఉండటం వల్ల ఆపరేషన్ ద్వారా వచ్చే ఫలితాన్ని ఎక్కువకాలం అనుభవించ గలరని పేర్కొన్నారు . యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇన్ఫో స్ట్రక్చర్ ఉండటం వల్ల ఇప్పటివరకు ప్రతి నెల సుమారు 100 నుంచి 150 మంది పేషెంట్లను రికవరీ చేసి పంపిస్తున్నామన్నారు . ప్రతి ముగ్గురిలో ఒకరికి షుగరు కంపల్సరిగా ఉంటుందని షుగర్ ఉండే వంద మందిలో 30 మందికి పెరిఫెరల్ అరటీరియల్ డిసైజ్ (పిఏడి) సమస్య ఉంటుందన్నారు . ఈ సమస్య వచ్చిన వారిలో మూడు రకాల సింటమ్స్ చూపిస్తుంది . ఫస్ట్ ది నడిచేటప్పుడు పిక్కలు బాగా పట్టుకుని భరించరని నొప్పితో ఏటువంటి పని చేసుకోలేరు , రెండవది పాదాలలో భరించరాన్ని నొప్పుతో నిద్ర పట్టక మనిషి ఆత్మహత్య చేసుకోవాలనే స్థితిలో ఉంటాడు , మూడవది మానని గాయాలు కాళ్లలో అవడం , కాళ్లలో ఒక భాగం నల్లగా మారడం , కుళ్ళిపోవడం , దుర్వాసన రావడం వంటి లక్షణాలు ఉంటాయి . అలా ఉన్నప్పుడు వెంటనే వాస్కులర్ సర్జన్ డాక్టర్ ను కలిసి సలహా సూచనలు తీసుకోవాలన్నారు . వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకుని అవసరాన్ని బట్టి డాప్లర్ టెస్ట్ , సిటీ యాంజియోగ్రామ్ టెస్టు లు చేపించుకోవడం ద్వారా




వ్యాధి తీవ్రత బయటపడుతుందన్నారు . ఈ వ్యాధిని సీరియస్గా తీసుకుని వీళ్ళెంతవరకు చికిత్స చేయించుకోవాలని సూచించారు . ఒకేసారి రెండు కాళ్ళకు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు . ఇది ఎక్కువగా తంబాకు , సిగరెటు , మద్యపానం తీసుకునే వారికి మరియు ఉబకాయం ఉన్న వారికి ఈ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి అన్నారు . ఇది వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే అవకాశం ఉంటుంది లేదా కాళ్లు గాని వేలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు . దీనిని లెగ్ ఎటాక్ అంటారని పేర్కొన్నారు . హార్ట్ బైపాస్ సర్జరీ లేదా స్టెంట్ ఎలా వేస్తామో అదేవిధంగా కాళ్లలో బ్లాక్ అయినా రక్తనాళాలకు బైపాస్ సర్జరీ లేదా స్టెంట్ వేస్తారన్నారు . దాన్ని గుర్తించి తగిన వైద్యం అందించి కాళ్లలో తగిన రక్త సరఫరా పెంచడం ద్వారా వారి యొక్క ప్రాణాలు , కాళ్లు , వేళ్ళు కాపాడుకోగలుగుతాం . ఎక్కువ శాతం షుగర్ పేషెంట్ కు కాళ్లకు ఒకచోట పుండు అయి దాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ సమస్యలు ఏర్పడుతుందన్నారు . ఎవరైనా హార్ట్ కు ఇంపార్టెంట్ ఇస్తారు గానీ కాళ్లకు ఇవ్వలేకపోతున్నారు అని అన్నారు . ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హై టెక్ సిటీ మార్కెటింగ్ మేనేజర్ డి . బాలరాజు , టీం లీడర్ కే . మహేష్ తదితరులు పాల్గొన్నారు .

# రేడియల్ రోడ్డు వద్దు... నర్కూడ రోడ్డు ముద్దు

- బూరుకుంట సతీష్
- ఎవరి ప్రయోజనాల కోసం

**రేడియల్ రింగ్ రోడ్డు**

**నిర్మిస్తున్నారని సతీష్ ఆగ్రహం**



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ - నర్కూడ రోడ్డును 120 అడుగుల వెడల్పుతో విస్తరిస్తున్నప్పుడు రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం అవసరం ఏమిటని శంషాబాద్ మండల్ మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బూరుకుంట సతీష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల భూములు లాక్కొని ఎవరి ప్రయోజనాల కోసం రేడియల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం నాడు శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న బూరుకుంట సతీష్... ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. ప్రభుత్వం తలపెట్టిన రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో నిరుపేద రైతుల వ్యవసాయ భూములతో పాటు ప్లాట్లు చివరికి జల వనరులు సైతం నాశనం కాబోతున్నాయని సతీష్ ఆందోళన వ్యక్తం చేశారు. నర్కూడ ప్రాంతంలో ఎందులో నిరుపేదలు పైసా పైసా చెమటోడ్చి పిల్లల పెళ్లిళ్ల కోసం ప్లాట్లు కొనుగోలు చేశారని అయితే ఇప్పుడు ప్రభుత్వం రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఆ ప్లాట్లను లాక్కునే పరిస్థితి నెలకొందని ఆయన వాపోయారు. శంషాబాద్ నుండి నర్కూడ మీదుగా ప్రస్తుతమున్న రోడ్డును ప్రభుత్వం 120 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేపట్టిందని,అలాంటప్పుడు మరో రోడ్డు (రేడియల్ రింగ్ రోడ్డు) ను నిర్మించాల్సిన అవసరం ఏమిటని బూరుకుంట సతీష్ ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాల కోసం రైతుల భూములు లాక్కొని రేడియల్ రింగురోడ్డును నిర్మిస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని సతీష్ డిమాండ్ చేశారు. రెండు రోడ్ల నిర్మాణంతో నర్కూడ, కవ్వగూడ ప్రాంత ప్రజలు ఊరు విడిచి మరో ప్రాంతానికి వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల చాలామంది ప్రజలు కన్న తల్లి లాంటి ఊరిని విడిచి మరో ఊరికి వెళ్తే ఇక్కడ ఓటు హక్కును కోల్పోక తప్పదని సతీష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి భూములు లాక్కోవాలని చూస్తే కార్తీక్ రెడ్డి సారధ్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సతీష్ అధికారులను హెచ్చరించారు. భూ సేకరణ చేపట్టే అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# కుష్టి వ్యాధి నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి






- రోగులకు మెరుగైన వైద్యం అందించడమే మన లక్ష్యం
- ఎన్ హెచ్ఆర్ సీ లేప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్

**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 18 ( నగరనిజం ) :** కుష్టి వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రోగులకు మెరుగైన వైద్యం అందించటమే మన ముందున్న లక్ష్యమని ఎన్ హెచ్ఆర్ సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రంగారెడ్డి జిల్లాకు విచ్చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనమునకు చేరుకున్న ఎన్ హెచ్ఆర్ సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్ కు అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, డా.లలితా దేవి, అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, డా.పాపారావు, తదితరులు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎన్ హెచ్ ఆర్ సి లెప్రసీ స్పెషల్ మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ తో కలిసి పాల్గొన్నారు. కుష్టు వ్యాధి నియంత్రణ చర్యలు అమలు, అలాగే వ్యాధి బారిన పడిన వ్యక్తుల మానవ హక్కుల పరిరక్షణ అంశాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ఆర్ సి స్పెషల్ లెప్రసి మానిటర్ ప్రదీప్తా కుమార్ నాయక్ మాట్లాడుతూ... కుష్టు వ్యాధి బారిన పడిన వ్యక్తుల హక్కులు, గౌరవం అలాగే సామాజిక సమానత్వాన్ని రక్షించడం ఎన్‌హెచ్ఆర్‌సి యొక్క ముఖ్య బాధ్యతని అన్నారు. కుష్టు వ్యాధి అనేది ప్రాచీనకాలం నుండి వస్తున్న వ్యాధి అని ఇది పూర్తిగా నయం చేయగలిగిన వ్యాధి అని, సమయానికి మెరుగైన ఔషధ చికిత్స (ఎండీటి) అందిస్తే పూర్తిస్థాయిలో నివారణ సాధ్యమని తెలిపారు. అయితే ఆలస్యంగా గుర్తించబడితే శాశ్వత వికలాంగతకు దారితీయవచ్చని అన్నారు. కుష్టు వ్యాధిని కేవలం వైద్య సమస్యగా కాకుండా, అపోహలు, సామాజిక వివక్షతో ముడిపడిన సామాజిక సమస్యగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపు, తొందరగా గుర్తింపు, ఆరోగ్య సేవలకు సులభ ప్రాప్తి, సామాజిక భద్రతా పథకాలు అలాగే విభాగాల మధ్య సమన్వయంతో హక్కుల ఆధారిత సమగ్ర దృక్పథం అవలంబించాలని అన్నారు. అలాగే జిల్లాలో వివిధ శాఖల ద్వారా లెప్రసీ బాధితులకు అందుతున్న వసతులపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి జిల్లాలో కుష్ఠు నియంత్రణ కార్యక్రమంకు సంబందించిన వివరాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. తరువాత జిల్లా కుష్ఠు వ్యాధి గ్రస్తుల వివరాలు వారికి అందుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, మానవ హక్కుల ప్రతినిధి, డా. నాయక్, శాఖల వారీగా సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే, కుష్ఠు వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని, కుష్ఠు వ్యాధిగ్రస్థులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా, అందరు అధికారులు మానవత్వంతో పని చేయాలని సూచించారు. కుష్ఠు వ్యాధి కార్యక్రమం జాయింట్ డైరెక్టర్, డా.జాన్ బాబు కుష్ఠు వ్యాధి వ్యాప్తి జరిగే విధానం, లక్షణాలు, చికిత్స, కుష్ఠు వ్యాధి నియంత్రణలో అందరి పాత్రను పూర్తిగా విశదీకరించారు. చివరగా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పాపారావు గారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి, డా. అంబికా, ఇబ్రహీంపట్నం ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. లక్ష్మి ప్రసన్న, జిల్లా పారా మెడికల్ అధికారి, శ్రీమతి సులోచన, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

## స్కూల్ లో ఫుడ్ ఫెస్టివల్ విజయవంతం






**మీర్పేట్ డివిజన్ ఫిబ్రవరి 18 (నగరనిజం)**మీర్పేట్ బ్రాంచ్ లోని SR Digi స్కూల్ లో ఫుడ్ ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించబడింది. నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు స్వీట్స్, స్నాక్స్, సాంప్రదాయ వంటలు మరియు ఫాస్ట్ ఫుడ్ పదార్థాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సహకార భావన మరియు బాధ్యతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం అరుణ, జోనల్ సుమలత, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, కోఆర్డినేటర్ సుదీర్ మరియు ఏజీఎం భీమ్లా రాథోడ్, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై వారి ప్రతిభను అభినందించారు.

## తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీలో భారీ చేరికలు




**కూకట్పల్లి ఫిబ్రవరి 18,(నగర నిజం ప్రతినిధి) :** మేడ్చల్,రంగారెడ్డి జిల్లా కీసర మండలం పరిధిలోని న్యూ హనుమాన్ నగర్ కాలనీ, రోడ్ నెం.2 నుండి సుమారు 50 కుటుంబాలు బుధవారం రోజు కూకట్పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ చేరిక కార్యక్రమం తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ చేతుల మీదుగా బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది. సామాజిక సేవకురాలు బి. వనజ, అలాగే జహంగీర్, హరి ప్రసాద్,శివ, రాజు, వంశీ, అభి, దినేష్, వాసు, సత్య, తేజు, సాయి, భాగ్య, కుమారి, వాణి, జ్యోతి, వరప్రసాద్, కృష్ణ, డేవిడ్, నవీన్,అడ్డగుట్ట ( సికింద్రాబాద్) నుండి బి. సంపత్, పి. శ్రీనివాస్ తదితరులు జనసేన అధినేత, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల నమ్మకంతో పార్టీ కండువాలు కప్పుకొని జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు యడమ రాజేష్, జిహెచ్ఎంసి అడ్హాక్ కమిటీ సభ్యులు కొల్లా శంకర్, వెంకటేశ్వరరావు,మహేష్,జనసైనికులు, వీర మహిళల ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# చేతులు జోడించి అర్ధిస్తున్నా నిర్వాసితులకు న్యాయం చేయండి

- సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్
- రేడియల్ రింగ్ రోడ్డు బాధితులను ఆదుకోవాలని అధికారులకు సర్పంచ్ శేఖర్ యాదవ్ మొర
- నిర్వాసితులంతా నిరుపేద బాధితులని ఆవేదన



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (నగరనిజం ప్రతినిధి):** దండం పెట్టి చెబుతున్నా.... చేతులు జోడించి అర్థిస్తున్న రేడియల్ రింగ్ రోడ్డు బాధితులకు న్యాయం చేయండని అధికారులను వేడుకున్నారు శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్. పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొనుగోలు చేసిన నిరుపేదలు ఇప్పుడు రేడియల్ రింగ్ రోడ్డు బాధితులుగా మారుతున్నారని శేఖర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాడు శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామపంచాయతీ వద్ద ఆర్డీఓ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్..... రేడియల్ రింగ్ రోడ్డు బాధితుల గోడును అధికారుల ముందు వెల్లబోసుకున్నారు. నర్కూడ వద్ద చాలా మంది నిరుపేదలు ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం పైసా పైసా కూడబెట్టి మార్కెట్ వాల్యూ ప్రకారం ప్లాట్లు కొనుగోలు చేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రేడియల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు సేకరిస్తే ఎందరో నిరుపేదలు రోడ్డున పడతారని వాపోయారు. ఈ నేపథ్యంలో అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి రేడియం రింగ్ రోడ్డు నిర్వాసిత బాధితులకు న్యాయం చేయాలని గడ్డం శేఖర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. గతంలో శంషాబాద్ వద్ద రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు నేపథ్యంలో భూములు కోల్పోయిన బాధితులకు ఎయిర్పోర్ట్ కాలనీలో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాట్లను కేటాయించారని, ఈ నేపథ్యంలో రేడియల్ రింగ్ రోడ్డు బాధితులకు అదే తరహాలో ప్లాటుకు ప్లాటు, భూమికి భూమి కేటాయించాలని సర్పంచ్ శేఖర్ యాదవ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొత్వాల్ గూడ, నర్కూడ పరిధిలో ప్రభుత్వ అసైన్మెంట్, సీలింగ్ భూములు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసి నిర్వాసిత బాధితులకు కేటాయిస్తే బాగుంటుందని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. బాధితుల పక్షాన దండం పెట్టి చెబుతున్నా, చేతులు జోడించి అర్థిస్తున్న దయచేసి నిర్వాసితులను ఆదుకోవాలని గడ్డం శేఖర్ యాదవ్ అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వీలైతే నర్కూడ గ్రామానికి కాస్త దూరంగా రోడ్డు నిర్మాణం చేపట్టేలా భూసేకరణ చేపడితే అందరికీ బాగుంటుందని శేఖర్ యాదవ్ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా హిమాయత్ సాగర్ జలాశయానికి వచ్చే వరద కాలువల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.



# ఫేక్ డిగ్రీ డాక్టర్ పై చర్యలు తీసుకోండి






- శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ కు ఫిర్యాదు చేసిన ఐఎంఏ వైద్యుల బృందం
- శంషాబాద్ వద్ద ఆసుపత్రిని నెలకొల్పుతున్న డాక్టర్ ఆనంద్ కుమార్ పై డీసీపీ కి వైద్యుల బృందం ఫిర్యాదు

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (నగరనిజం ప్రతినిధి):** చదివింది ఎంబీబీఎస్ అయితే దానికి నకిలీ డిగ్రీలు అంటించుకుని ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వైద్యం చేస్తున్న డాక్టర్ ఆనంద్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని పలువురు ఐఎంఏ వైద్యుల బృందం శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ కు ఫిర్యాదు చేశారు. తప్పుడు డిగ్రీలను తగిలించుకొని ప్రైవేటు ఆసుపత్రులను నడుపుతూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని ఐఎంఏ వైద్యుల బృందం శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శంషాబాద్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అమరేందర్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ సంతోష్ కుమార్, శివకాంత్ తదితర వైద్యుల బృందం శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన శంషాబాద్ ఐఎంఏ అధ్యక్షుడు అమరేందర్.... శంషాబాద్ వద్ద ఏబీవీ రీ లైఫ్ ఆసుపత్రిని నెలకొల్పుతున్న డాక్టర్ ఆనంద్ కుమార్ చదివింది ఎంబీబీఎస్ అయితే దాని పక్కన ఎండి జనరల్ మెడిసిన్ ఫ్రం లండన్ గా డిగ్రీలు తగిలించుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు షాద్నగర్ లో అప్పుడు డిగ్రీలు తగిలించుకొని వైద్యం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న డాక్టర్ ఆనంద్ కుమార్ పై ఇప్పటికే టీఎస్ఎంసీ లో కేసు విచారణలో కొనసాగుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా తాజాగా శంషాబాద్ రాల్లగూడ రోడ్డులో ఏబీవీ రీలైఫ్ పేరుతో మరో ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ ఆనంద్ కుమార్ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సంబంధించి శంషాబాద్ ఐఎంఏ అసోసియేషన్ అధ్యక్షుడిగా తన పేరును డాక్టర్ ఆనంద్ కుమార్ వాడుకుంటున్నారని, వాస్తవానికి ఆనంద్ కుమార్ తో తనకు ఎలాంటి సంబంధం లేదని డాక్టర్ అమరేందర్ తేల్చి చెప్పారు. డాక్టర్ ఆనంద్ కుమార్ శంషాబాద్ లో నెలకొల్పుతున్న ఏబీవీ రీ లైఫ్ ఆసుపత్రికి ఐఎంఏ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో చదివింది ఎంబీబీఎస్ అయితే నకిలీ డిగ్రీలు అంటించుకొని వైద్యం చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్న డాక్టర్ ఆనంద్ కుమార్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని డాక్టర్ అమరేందర్ వివరించారు. నకిలీ డిగ్రీలతో వైద్యం చేసే వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అమరేందర్ హెచ్చరించారు. నకిలీ డిగ్రీలతో వైద్యులుగా చలామణి అయ్యే వారిని ప్రోత్సహించడం మంచిది కాదని డాక్టర్ అమరేందర్ అభిప్రాయపడ్డారు.







Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE